సాక్షి
బాపట్ల
మంగళవారం । 28 । మార్చి । 2023



నృసింహుని హుండీ లెక్కింపు

మంగళగిరి: స్థానిక శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. దిగువ సన్నిధిలోని ముఖ మండపంలో లెక్కించగా ఆదాయం రూ.41,48,381 సమకూరింది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,200, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



జాతీయ పోటీలకు లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: జాతీయ పోటీలకు ఇద్దరు లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. వీరిలో వి.రేవతి, జి.చంద్రిక ఉన్నారు.



పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

● ఇళ్ల వద్దకే వైద్యం ● గ్రామాల్లోనే ఉచిత వైద్య సేవలు ● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ● 104 వాహనాల ప్రారంభం

చిలకలూరిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని అధికారికంగా ప్రారంభించబోతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాకు సంబంధించిన నూతన 104 మొబైల్ మెడికల్ వాహనాలను స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అందు కోసం ఇప్పటికే నూతన 104 వాహనాలను సమకూర్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 వాహనాలను అన్ని జిల్లాలకు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 104 వాహనాలు 676 ఉన్నాయని, ఇప్పుడు వీటికి అదనంగా మరో 260 వాహనాలు వచ్చి చేరాయని చెప్పారు.

విజయవంతంగా ట్రయల్ రన్...

ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి రజిని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇది ఒక గొప్ప కార్యక్రమంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను జగనన్న అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో ఈ విలేజ్ క్లినిక్‌లు కీలకంగా మారనున్నాయని చెప్పారు. ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్

ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండేలా నియామకాలు పూర్తి చేశామని, వీరిలో డాక్టర్ కచ్చితంగా మొబైల్ వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందజేస్తారన్నారు. ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో 104 వాహనం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వచ్చేలా కార్యక్రమం రూపొందించినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించటం ఉచితంగా చికిత్స అందించటం వైద్యుల విధి అని పేర్కొన్నారు. ఏకంగా 14రకాల పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ప్రస్తుతానికి 67 రకాల మందులు కూడా ఉచితంగానే అందజేస్తారని చెప్పారు. త్వరలో మందుల సంఖ్య



104 వాహనాన్ని నడుపుతున్న మంత్రి రజిని



సిద్ధంగా ఉన్న 104 వాహనాలు

105కు పెంచనున్నమన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు కూడా ప్రత్యేక వైద్య సేవలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో లభిస్తాయని చెప్పారు. డాక్టర్లు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. కదలలేని పరిస్థితుల్లో మంచంలో ఉన్న రోగుల ఇళ్లకు వైద్యులు వచ్చి చికిత్స అందిస్తారని తెలిపారు. దీంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు వ్యవస్థ ద్వారా ఆరోగ్య వివరాలన్నింటిని పదిల పరుస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి నిలిపిందని చెప్పారు. మంత్రి రజిని స్వయంగా 104 వాహనం నడిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జి.శోభారాణి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి

● జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్
● పది పరీక్షలపై అధికారులతో సమీక్ష



బాపట్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై అనుబంధశాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షలు ముగిసే వరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్షా కేంద్రాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోడానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక వైద్యం కోసం ప్రతి కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి సెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తొలిసారిగా బాపట్ల జిల్లాలో జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలీస్‌స్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తరలించేటప్పుడు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, ఆయా అనుబంధ శాఖల అధికారులను నియమిస్తూ తక్షణమే ఉత్తర్వులు పంపాలన్నారు. 103 పరీక్ష కేంద్రాలలో పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, 331 పాఠశాలల నుంచి 17,344 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఏఎస్పీ మహేష్, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, డీఈఓ పి.వి.రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ వై.శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించాలి

బాపట్లఅర్బన్: జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు కోవిడ్ కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నపాటి అనుమానం వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కోవిడ్ ఉన్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి, సీపీఓ భరత్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌నాయక్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ విద్యాసాగర్, మత్స్యశాఖ జేడీ సురేష్, పశుసంవర్ధక శాఖ జేడీ సురేష్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డి.ఎస్.ఓ విలియమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

స్కిల్ స్కాంలోనూ చంద్రబాబు పాత్ర

● ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగన్
● రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు

బాపట్ల: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన స్కిల్ డవలప్‌మెంట్ నిర్వహణలో కూడా చంద్రబాబునాయుడు అవినీతి పాల్పడ్డారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోపిదేవి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు ఏర్పాటుచేసిన స్కిల్ డవలప్‌మెంట్‌కు రూ.3,300కోట్లు కేటాయించి అందులో 10శాతం రాష్ట్రప్రభుత్వ వాటాగా రూ.330కోట్లు చంద్రబాబు తన అకౌంట్‌కు మళ్లించుకున్నాడని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా వారి జీవితాలతో చంద్రబాబు నాయుడు ఆడుకున్నారని మోపిదేవి పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, యేసురత్నం ఎమ్మెల్యే కోన

వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కొంతమంది ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేశారని మోపిదేవి తెలిపారు. చంద్రబాబునాయుడుకు అడ్డదారుల్లో అధికారాన్ని ఏవిధంగా చేజిక్కించుకోవాలో వెన్నతో పెట్టిన విద్యగా పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వందలాది కోట్ల రూపాయలు స్వాహా చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టిన దగ్గర నుంచి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు సచివాలయాలు, వలంటీర్లు, ఔట్‌సోర్సింగ్‌లలో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఒకపక్కన సంక్షేమం..మరోపక్కన అభివృద్ధి చేసి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ వేయటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులో విచారణ ఎదుర్కొంటున్న చంద్రబాబు మళ్లీ కొంతమంది ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి వారికి కూడా రాజకీయ భవిష్యత్ లేకుండా చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు తనను కూడా ప్రలోభాలకు గురి చేయాలని ప్రయత్నించారని, ప్రలోభాలకు లోనైన వారికి రాజకీయ భవిష్యత్ ఉండదని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దక్కుతుందని అందరం భావించామని, అయితే అందులో కూడా చేతివాటం ప్రదర్శించి నిరుద్యోగులకు మొండిచేయి చూపారని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకొని..



పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టభద్రులకు సన్మానం

1970 బ్యాచ్ పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

వేటపాలెం: ఏరా ఎలా ఉన్నావు.. ఇంట్లో మనుమలు, మనుమరాళ్లు అందరూ బాగున్నారా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. హలో ఎన్నాళ్లయిందిరా చూసి నీ ఆరోగ్యం బాగుందా అంటూ ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. బండ్ల బాపయ్య హిందూ కళాశాలల్లో 1970లో హెచ్ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల్లో డిగ్రీ పూర్తి చేసి 50 ఏళ్లు నిండిన సందర్భంగా వారు ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. వేటపాలెం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులను సన్మానించారు. ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్న లక్ష్మీసంధ్యకు రూ.28 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, ప్రత్తి చంద్రశేఖర్, వలివేటి గుప్తా, వూట్ల వెంకటేశ్వర్లు, నున్నా మస్తాన్‌రావు, ఊటుకూరి సుధాకర్, డీవీ సుబ్బారావు, అజయ్‌గోష్, నరాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై న్యాయ విచారణ జరగాలి

● స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు పక్కదారి
● చంద్రబాబు తప్పకుండా శిక్ష అనుభవించాల్సిందే
● చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి ధ్వజం

కారంచేడు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబుపై ఫాస్ట్‌ట్రాక్ న్యాయ విచారణ జరపాలని చీరాల మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కారంచేడులో డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలతో చేసిన ఆరోపణపై వెంటనే విచారణ జరపాలన్నారు. అబద్ధాన్ని నిజం చేసేందుకు గోబెల్స్ ప్రచారంతో కొన్ని మీడియా వ్యవస్థలను అడ్డుపెట్టుకొని ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. మేము ఏది చెబితే అదే నిజమని ప్రజలు నమ్ముతారనుకుంటే అది చంద్రబాబు భ్రమ అవుతుందన్నారు.

స్టేలకు వెళ్లకుండా విచారణ ఎదుర్కో...

రాష్ట్రంలో నిరుద్యోగులకు సాంకేతిక శిక్షణనిస్తూ, వారికి ఉపాధి కల్పించేందుకు కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధారాలతో ఆరోపణలు చేస్తే వాటిని బెంచ్ మీదకు రాకుండా ఉండేందుకు తన నీచమైన పరపతిని ఉపయోగించి న్యాయ వ్యవస్థను మేనేజ్ చేసుకుంటూ స్టేలకు వెళ్లకుండా వెంటనే న్యాయం జరిగేలా చంద్రబాబే తనపై న్యాయ విచారణ కోరాలన్నారు. మేము ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందం పెట్టుకోలేదని అంతర్జాతీయ స్థాయి కంపెనీ చెప్తుంటే, సీమెన్స్ స్కాంలో రూ.3400 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

వాటాగా రూ.371 కోట్ల నిధులను వివిధ కంపెనీలకు డ్రా చేసే నిమిత్తం ఆదేశాలు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు మా ప్రమేయంతో జరగలేదని కేవలం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు ఆదేశిస్తే మేము నోట్‌ఫైల్‌లో కూడా ఇది చట్ట విరుద్ధమని వ్యతిరేకించామని వారు పేర్కొన్నారన్నారు. ఐదేళ్లకు పైగా తనకు పీఏస్‌గా పనిచేసిన శ్రీనివాసరావు వ్యక్తిగత ఖాతాల్లోకి వందల కోట్లు కంపెనీల నుంచి వస్తే నాకు సంబంధం లేదని చెబితే ఎలా అని వాటికి చట్ట ప్రకారం నీవు సమాధానం చెప్పి తీరాలన్నారు. వీటిపై న్యాయపరమైన శిక్షను అనుభవించాల్సిందేనని డిమాండ్ చేశారు. అప్పట్లో ఆయన ఏ ప్రాజెక్టు ప్రారంభించినా ఈయన కమీషన్‌ను తన సొంత ప్రైవేటు వ్యక్తులకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటూ బిల్లులు ఎగకొట్టడం ఈయనకు అలవాటని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, రాష్ట్ర హిస్టరీ అకాడెమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, మార్టూరు ఇంకొల్లు, కారంచేడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు దండా చౌదరిబాబు, బండారు ప్రభాకర్, పఠాన్ కాలేషావలీలు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

యద్దనపూడి: సృజనాత్మకతకు పట్టం కట్టారు. కాలీగ్రఫీ రైటింగ్‌తోపాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడులోని యూపీ పాఠశాలలో హెచ్ఎం జి.శ్రీనివాసరావు, క్యాలీగ్రఫీ శిక్షకులు షేక్ జున్నుసాహెబ్, విద్యా వలంటీర్ షేక్ చాందినీ ఆధ్వర్యంలో క్యాలీగ్రఫీ రైటింగ్‌తో పాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంపై నెలరోజులు శిక్షణ ఇచ్చారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు బాలబాలికలందరూ పాల్గొని నేర్చుకున్నారు. సోమవారం వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారత ప్రతినిధి వంగ నరేంద్రగౌడ్, న్యాయనిర్ణేతగా అదే సంస్థ ప్రతినిధి గంగాధర్, నరసరావుపేట లిమ్రా కోచింగ్ సెంటర్ చైర్మన్ షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించారు. రెండు గంటల్లో కాలీగ్రఫీలో తాము నేర్చుకున్న విభిన్నతను రాసి చూపించాలని లక్ష్యం ఇచ్చారు. కేవలం గంటా 26 నిమిషాల్లోనే పేర్లు, డిజైన్లు వేసి అందులో రకరకాల రంగుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.



వండర్‌బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా



పొదుపు సంఘాల మహిళలకు చెక్కు అందిస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి

● రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు
● పొదుపు మహిళల ఖాతాల్లో రూ.41 కోట్లు జమ

బాపట్ల: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ ఆసరా ఎంతో దోహదపడుతుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మూడో విడతలో వైఎస్సార్ ఆసరా పథకం కింద విడుదల చేసిన రూ.41 కోట్లు బాపట్ల నియోజకవర్గంలోని పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని సోమవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. మోపిదేవి మాట్లాడుతూ విశ్వసనీయతకు మారుపేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో గూడుకట్టుకుని ఉన్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని అన్నారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసరాతో ఎంతో మందికి మేలు జరిగిందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. విద్య, వైద్యం కోసం అప్పులు చేసే పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఆసరాతో మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమని అన్నారు. రఘుపతి మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు విడతల్లో నగదు జమ చేశారని హర్షం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబునాయుడు పొదుపు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇవ్వటం, వాటిని అమలు చేయకపోవటంతో 24శాతం గ్రూపులు రద్దయ్యాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బొంత అర్జునకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్తేరురాణి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్లు కొక్కిలిగడ్డ చెంచయ్య, మామిడయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎంపీడీఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సబ్ జైలు తనిఖీ



గురజాల: స్థానిక సబ్‌జైలును జూనియర్ సివిల్ జడ్జి కె.మంజులత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలు తాగునీటి వసతి సరిగ్గా లేదని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జడ్జి నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు నిర్వహించి ఖైదీలకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. అదే విధంగా ఖైదీలకు వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదుల బాక్స్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట న్యాయవాది కలివెల ప్రభుదాసు ఉన్నారు.

మిర్చి యార్డుకు 92,254 బస్తాల రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు 92,254 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 89,659 బస్తాలు కొనుగోళ్లు జరిగింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,011 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వైద్యసిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



నరసరావుపేట: ప్రతి ఒక్కరూ రీ–ఓరియంటేషన్‌ను వినియోగించుకొని లక్ష్యాలను వంద శాతం సాధించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం తన కార్యాలయంలో జిల్లా గణాంక విభాగం ద్వారా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని ఏఎన్ఎంలకు చేపట్టిన పదిరోజుల శిక్షణను ప్రారంభించారు. మొదటిరోజు నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల ఏఎన్ఎంలకు ఆర్‌సిహెచ్, ఏఎన్ఎంఓఎల్ ప్రోగ్రాము, సీఎస్ఎస్ఎస్, హెచ్ఎంఐఎస్ రిపోర్టింగ్ ఫార్మెట్స్, యాప్‌లపైన శిక్షణతో పాటు ఆన్‌లైన్ సర్వీసులను పూర్తిగా వందశాతం వినియోగించుకొని ఫలితాలు సాధించే విధంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జి.చంద్రశేఖర్, డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

ఐదుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్–2 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 43,613 మంది విద్యార్థుల్లో 42,468 మంది విద్యార్థులు సోమవారం పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. మాచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిలకలూరిపేటలోని సీఆర్ జూనియర్ కళాశాలలో ఇద్దరు చొప్పున, ఏఎంజీ జూనియర్ కళాశాలలో ఒకరు పట్టుబడ్డారు.

మానవాళి ప్రగతికే సాంకేతికత

జేఎన్‌టీయూ–ఎన్‌లో సాంకేతిక సమ్మేళనం



సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ చక్రవర్తి ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట ఈస్ట్: శాస్త్ర సాంకేతికత మానవాళి ప్రగతికే ఉపయోగపడాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం డిజిటల్ మానిటరింగ్ సెల్ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎ.ఎస్.ఎన్.చక్రవర్తి చెప్పారు. జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డెవలప్ ట్రీస్ సంస్థ సౌజన్యంతో జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ చక్రవర్తి మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే జవాబుదారీతనం, సత్ప్రవర్తన అలవరుచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. సమ్మేళనంలో భాగంగా గేమిఫికేషన్, 3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి దాదాపు 500మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం సావనీర్‌ను ప్రొఫెసర్ చక్రవర్తి విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, డెవలప్ ట్రీస్ సంస్థ సీఈఓ డి.శ్రావణ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే వేగవంతం

ఈపూరు: పల్నాడు జిల్లాలో భూ రీసర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీ విలేకరులతో మాట్లాడుతూ తొలిదశలో 70 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని, వాటిలో 58 గ్రామాల్లో వెబ్ ల్యాండ్ చేశామని, 12 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 46 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని, రిజిస్ట్రేషన్‌లు సచివాలయాల్లో కాని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేయించుకోవచ్చని వివరించారు. జిల్లాలో మొత్తం 3.70లక్షల ఎకరాలకు గ్రౌండ్ ట్రూత్ పూర్తయిందన్నారు. అకాల వర్షాలకు మొక్కజొన్న, శనగ పంటలు దెబ్బతిని ఉంటే అధికారులు పరిశీలించిన అనంతరం నష్టపరిహారం అందజేస్తామని వెల్లడించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, సర్వేయర్ చండీరాణి పాల్గొన్నారు.

స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలి



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 36 మంది అర్జీదారులు ఎస్పీని కలసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. స్పందన అర్జీలపై జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ జిల్లాలోని పోలీస్‌లతో మాట్లాడారు. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. అర్జీదారులను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కార్యాలయానికి వచ్చిన అర్జీ ఇచ్చిన అర్జీదారులు తిరిగి మరోసారి స్పందన కార్యక్రమానికి వస్తే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీదారుడి అర్జీలను క్షుణ్ణంగా చదివి సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. పరిష్కరించని పక్షంలో కారణాలను వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాల అభ్యున్నతే ధ్యేయం

బాపట్లటౌన్ పోలీస్ కుటుంబాల అభ్యున్నతే ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ కె.బ్రహ్మయ్య భార్య కె.లక్ష్మికి అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కు అందజేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కె.బ్రహ్మయ్య 2022 అక్టోబర్ 25న అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కు అందజేశామన్నారు. పోలీసుశాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చని, పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇతర అన్ని రకాల బెనిఫిట్స్‌లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

– ఫారెస్టు రేంజర్ శ్రీదేవి



మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ శ్రీదేవి

వేటపాలెం: జిల్లా తీరం వెంట సముద్ర తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్టు రేంజర్ ఆర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలోని ట్రీఫౌండేషన్‌లో తాబేళ్ల సంరక్షకులకు అవగాహన ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 2017 నుంచి జిల్లాలో ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సంరక్షిస్తున్నామని తెలిపారు. సముద్ర జీవవైవిధ్యంలో భాగంగా ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని సంరక్షించుకోవడం కోసం తీరప్రాంత గ్రామాల్లో సంరక్షకులను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సంరక్షకులు రత్నకుమారి, దయామణి, మయూరి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో సమాజానికి హానికరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: మాదక ద్రవ్యాల వినియోగంవల్ల వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబపరంగా, సామాజికపరంగా తీవ్ర నష్టాన్ని మిగులుస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులకు ఒకరోజు మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలన్నారు. మన పిల్లలు మంచివారైనా చెడు స్నేహాల కారణంగా తప్పుదోవ పట్టే అవకాశాలున్నాయని చెప్పారు. ఒక్కసారి వాటికి బానిసలైతే తేరుకోవడం చాలా కష్టమని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి అధికారులు జిల్లా స్థాయి వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. దీన్లో వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే సామాజిక సమస్యల పరిష్కారం



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

అమరావతి: వందల ఏళ్ల నుంచి వేళ్లూనుకున్న సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం ప్రజాచైతన్యంతోనే సాధ్యమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం వద్ద హరిత అతిథి గృహంలో సోమవారం కేవీపీఎస్ రాష్ట్రస్థాయి మూడురోజుల శిక్షణ తరగతుల ప్రారంభమయ్యాయి. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. ఆనందబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్లు వర్తమాన రాజకీయ పరిస్థితులు అనే అంశంపై మాట్లాడారు. తొలుత కేవీపీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మరో ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షుడు చిరంజీవి, సహాయ కార్యదర్శి పి.వసంత్, రాష్ట్ర నాయకులు ఈశ్వర్, కుటుంబరావు, రామదాసు, విజయమ్మ, ఎస్‌జి కృష్ణ, సింహాచలం, విజయరాజు, అమరావతి మండల ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబుతోపాటుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన రెండు వందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మంటల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి

మంగళగిరి: ఆత్మకూరు టీడీపీ జాతీయ కార్యాలయం వద్ద ఈనెల 24వ తేదీన బాణసంచా కాలుస్తూ ప్రమాదవశాత్తూ బాణాసంచా పేలి తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త సోమవారం రాత్రి మృతి చెందాడు. బాణసంచా ప్రమాదంలో నలుగురు గాయపడి ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో నగరంలోని మార్కండేయ కాలనీకి చెందిన తాడిశెట్టి చెన్నయ్య (25) మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం అనాథగా మారింది.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

క్లీనర్ మృతి.. డ్రైవర్‌కు గాయాలు



లారీ మధ్యలో ఇరుక్కు పోయి మృతి చెందిన క్లీనర్ బిక్షం

పిడుగురాళ్లరూరల్: లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ఘటనలో క్లీనర్ మృతి చెందాడు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండలంలోని కామేపల్లి లోని కాసు బ్రహ్మానందరెడ్డి హైవేపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెట్రో కోక్ బొగ్గును లోడు చేసుకుని నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ బాలానగర్‌కు వెళ్తున్న లారీ కామేపల్లి గ్రామం వద్ద అదుపుతప్పి పొలాల్లో దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ భిక్షం(45) అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ దస్తగిరికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. క్లీనర్ భిక్షం పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ రైట్ కెనాల్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మామ కాదు.. కామాంధుడు!

- మామ లైంగిక వేధింపులపై అంధురాలైన కోడలు ఫిర్యాదు
- ప్రాణ రక్షణ కల్పించమంటూ ఎస్పీకి వేడుకోలు

నగరంపాలెం: పెళ్లైన దగ్గర్నుంచి మావ లైంగికంగా వేధిస్తున్నాడు. అతనికి ఇద్దరు అత్తలు సహకరిస్తున్నారు. దీనిపై అంధురాలైన ఓ కోడలు భర్తతో కలిసి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక– స్పందన (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేసింది. మావ చేస్తున్న వికృత చేష్టలను చెబుతూ విలపించింది. బాధితురాలి మాటల్లో.. 2013లో క్రితం పెళ్లైంది. భర్త ప్రైవేటు విద్యుత్ పనులు చేస్తుంటాడు. ఒక బాబు సంతానం. మావకు ఇద్దరు భార్యలు. అయినప్పటికీ పెళ్లైన దగ్గర నుంచి మావ వేధించడం మొదలెట్టాడు. ఇద్దరత్తలతో సంసారం చేస్తూ, తనను లైంగిక సంసారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. లైంగిక సుఖాన్ని ఇవ్వాలని, అదును చూసి బలాత్కారానికి ప్రయత్నిస్తున్నాడు. తన కోరిక తీర్చలేదని నాపై పగ పెంచుకున్నాడు. తనతోపాటు భర్తను హింసిస్తున్నాడు. కొడుకు కోసం పెళ్లి చేయలేదని, తన కోసమని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2023 జనవరి 3న ఇద్దరి అత్తల సహాయంతో తనపై లైంగిక దాడికి యత్నించి, శరీరమంతా రక్కాడు. దీంతో మనస్థాపం చెంది పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించా. గతంలోనూ నాపై వేరే వారితో దాడి చేయించాడు. ఇవన్నీ కూడా నన్ను లొంగదీసుకునేందుకు చేసినవే. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయినప్పటికీ మావ ప్రవర్తనలో మార్పులేదు. కామవాంఛతో తనపై, భర్తపై వేరే వ్యక్తులతో దాడి చేయించాడు. కేసుల్లో రాజీకి రాకపోతే అంతు చూస్తానని ఊళ్లో బహిరంగంగా చెబుతున్నాడు. పలుకుబడి ఉన్న మావ ఏదైనా చేసేందుకు సిద్ధహస్తుడని తెలిపింది. తమ బిడ్డ కోసం జీవిస్తున్నామని, లేనిచో ఈ లోకాన్ని విడిచి వెళ్తామని విలపించింది. ఇప్పటికైనా నా మావపై, ఇద్దరి అత్తలపై బైండోవర్ కేసులు నమోదు చేసి, మావపై రౌడీషీట్ తెరిచి తమకు ప్రాణరక్షణ కల్పించాలని ఎస్పీని అభ్యర్థించింది.

నాదెండ్ల వృషభాలకు చాంపియన్‌షిప్



ప్రథమ స్థానంలో నిలిచిన వృషభరాజాలు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు వేణుగోపాలరావుకు చెందిన ఒంగోలు జాతి వృషభ రాజాలు మహారాష్ట్రలో జరిగిన మహాపశుధన్ ఎక్స్‌పో– 2023లో చాంపియన్‌షిప్ సాధించాయి. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా షిర్డీలో ఈ నెల 20 నుంచి వారం రోజుల పాటు జరిగిన ఎక్స్‌పో–2023లో దేశ నలుమూలల నుంచి పశువులను తరలించారు. ఆల్ బ్రీడ్ మేల్, ఫీమేల్ చాంపియన్, ఒంగోలు జాతి పశువుల అందాల పోటీల్లో ప్రథమ స్థానాన్ని నాదెండ్ల వృషభాలు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మహారాష్ట్ర పశు సంవర్థక శాఖ ముఖ్య కమిషనర్ చేతుల మీదుగా వేణుగోపాలరావు అవార్డును అందుకున్నారు. గత నెలలో ప్రపంచ స్థాయిలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, వండర్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో వేణుగోపాలరావుకు చెందిన కోడెదూడ చోటు సంపాదించింది. ఇరవై ఐదు నెలల వయస్సు గల ఒంగోలు జాతి కోడెదూడ 65 అంగుళాల ఎత్తుతో రికార్డు నెలకొల్పింది.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ



ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- శ్రీదేవి రాజకీయాలకు అనర్హురాలు
- నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించి శ్రీదేవి నీతులు వల్లించడం సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడికొండ: ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చతెచ్చిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రాజకీయాలకు అనర్హురాలని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. తాడికొండ మండలం లాం గ్రామంలోని ప్రధాన కూడలిలో శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేసిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పార్టీని అడ్డుపెట్టుకొని భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. అంగన్‌వాడీ ఆయా మొదలుకొని నామినేటెడ్ పోస్టులను అమ్ముకొని భారీ అవినీతికి పాల్పడిన ఆమె మీడియాలో దళిత కార్డు అడ్డుపెట్టుకొని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలుగు సంవత్సరాలు వైఎస్సార్ సీపీ పాలనలో అధికారం అనుభవించి చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం పార్టీని వీడిని ఆమెకు నిజంగా ప్రజల మద్దతు ఉంటే నియోజకవర్గానికి వచ్చి ప్రజాసేవ చేస్తే బండారం బయట పడుతుందన్నారు. నిన్న మొన్నటి వరకు అమరావతి రైతుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ ప్రత్యేక పోలీసు వాహనాన్ని పెట్టుకొని తిరిగిన ఎమ్మెల్యే శ్రీదేవి ఇప్పుడు అమరావతి ఉద్యమంలో పాల్గొంటామనడం ఆమె అవినీతి పరాకాష్టకు చేరిందనేందుకు నిదర్శనమన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మీర్జావలి, నూర్జహాన్, రావూరి నరేష్, దాసరి జ్ఞానప్రకాశం, భాగ్యారావు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంచలనం కోసం శ్రీదేవి ప్రాణహాని వ్యాఖ్యలు

ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

తాడికొండ: మీడియా సంచలనం కోసం ఉండవల్లి శ్రీదేవి తనకు ప్రాణహాని ఉందనే వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, సజ్జల గారికి నీతో ఏంపని, ఆయన స్థాయి ఏంటి మనస్థాయి ఏంటని ఆలోచించుకోవాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం వెంకటపాలెం టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉండవల్లి శ్రీదేవి అనవసరమైన ప్రేలాపనలు మాట్లాడకుండా తన పని తాను చూసుకొని కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. ఆమె ఎవరితో పనిచేయాలనుకుంటే వారితో పనిచేయవచ్చని, అమరావతి రైతుల కోసం పనిచేస్తానంటే చెయవచ్చని, అమరావతి రైతులకు తాము కూడా వ్యతిరేకం కాదని వారికోసం తాము పని చేస్తున్నామన్నారు. రాజకీయంగా ఉండవల్లి శ్రీదేవి చేసిన వ్యాఖ్యలకు తాము వ్యతిరేకమని, అనవసరమైన ఆరోపణలు చేసి ప్రజల్లో పలచన కావద్దని సూచించారు. వివాదాస్పద వ్యాఖ్యలు ద్వారా ఎదుగుదామనుకోవడం తప్పని, ఆమె ఎంచుకున్న మార్గంలో ప్రత్యేకంగా వెళ్ళిపోతే తప్పులేదు కానీ, అనవసరంగా వ్యక్తులను నిందిస్తూ సజ్జలపై ప్రాణహాని వ్యాఖ్యలు చేయడం వలన పత్రికల్లో ఓ రోజు పబ్లిసిటీ వస్తుంది తప్ప ప్రయోజనం ఉండదన్నారు. ఆమెకు ఎలాంటి ప్రాణభయం లేదని, అన్ని రక్షణ వ్యవస్థలు అనుకూలంగా ఉంటాయని, తాము కూడా వ్యక్తిగతంగా ఏమీ జరగకుండా చూస్తామని, ఆమె పనులు ఆమె చూసుకోవచ్చన్నారు.

విజ్ఞాన్ స్రవంతి పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరురూరల్: విద్యార్థులకు విద్యతోపాటుగా క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు తమ కళాశాల కృషి చేస్తుందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏప్రిల్ 14, 15 తేదీలలో నిర్వహించనున్న విజ్ఞాన్ స్రవంతి సాంస్కృతిక క్యాక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంతర కళాశాలల విద్యార్థులకు వివిధ రంగాల్లో లలితకళలు, చిత్రలేఖనం, క్రీడలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి అనూరాధ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక పాల్గొన్నారు.